ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025

రూ.3.03 కోట్లు విలువజేసే సెల్‌ఫోన్లు అప్పగింత

ప్రజాశక్తి-అనంతపురం

వివిధ ప్రాంతాల్లో దొంగతనానికి గురై పోలీసుల ఛేదనలో దొరికిన రూ.3.03కోట్లు విలువజేసే 12,594 మొబైల్ ఫోన్లను బాధితులకు అనంత పోలీసులు అందజేశారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్ వీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు రికవరీ చేసిన వాటిలో దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని బాధితులకు వాటిని అందజేశామన్నారు. సెల్ ఫోన్ దుకాణం నిర్వాహకులు, ఇతరులెవరైనా అపరిచితులు అమ్మేఫోన్లను కొనుగోలు చేయొద్దన్నారు. ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు జవాబుదారీగా అందించేందుకు కృషి చేసిన జిల్లా పోలీస్ సైబర్ విభాగం సిఐ షేక్ జాకీర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఉమ్మడి అనంతలో కొత్త పరిశ్రమలు

- గార్మెంట్స్, ఎయిరో స్పేస్‌కు అనుమతులు
- రూ.1201.95 కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్త పరిశ్రమలకు అనుమతులను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గార్మెంట్, ఎయిర్ స్పేస్, డిఫెన్స్ పరిశ్రమలకు అనుమతులిచ్చిన వాటిల్లోనున్నాయి. రాప్తాడు, గుడిపల్లి, బేకులోడు, అనంతపురం జిల్లాలోని తిమ్మసముద్రం గ్రామాల్లో వీటి ఏర్పాటు జరుగనున్నాయి.

రేమండ్స్

రాప్తాడు వద్ద రేమండ్స్ గార్మెంట్ పరిశ్రమకు సబ్సిడరీ సంస్థ స్వార్డ్స్ అపెరెల్ ఏర్పాటుకు అనుమతిచ్చారు. 26.87 ఎకరాల్లో ఈ పరిశ్రమను స్థాపించనున్నారు. రూ.330 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టనున్నారు. ఎకరం రూ.20లక్షల రూపాయల చొప్పున భూములు కేటాయింపులు జరిగాయి.

ఎయిరో స్పేస్ పరిశ్రమ

చిలమత్తూరు మండలం బేకులోడు వద్ద ప్రిసిషన్ ఇంజనీరింగ్ ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 29.57 ఎకరాల భూమిని ఇక్కడ కేటాయించారు. ఎకరం రూ.37లక్షల చొప్పున కేటాయింపులు జరిగాయి. రూ.256 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టనున్నారు.

గుడిపల్లి వద్ద మరొకటి...

సత్యసాయి జిల్లా గుడిపల్లి వద్ద ప్రిషిషన్ ఆటో పార్ట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి 24.39 ఎకరాల భూములు కేటాయించారు. రూ.430 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. మూడు పరిశ్రమలు కలిపి మొత్తం రూ.1201.95 కోట్లు పెట్టుబడులు రానున్నాయి.

తిమ్మసముద్రంలో డిఫెన్స్ పరిశ్రమ

అనంతపురం జిల్లా తిమ్మసముద్రంలో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతినిచ్చారు. జినన్‌ఫ్రా సంస్థ ఈ ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. 121 ఎకరాల భూమిని ఈ పరిశ్రమకు కేటాయించనున్నారు. రూ.1150 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. త్రివుల్ బేస్ ప్రొపెల్లెంట్, సింగిల్ బేస్ ప్రొపెల్లెంట్, బయోమాడ్యుల్ ఛార్జింగ్ సిస్టమ్ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.

వీటి ద్వారా 6571 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. ఈ పరిశ్రమల ఏర్పాటు 2024 నుంచి 2032 వరకు వివిధ దశల్లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది.

గందరగోళంగా బదిలీల ప్రక్రియ

- అనంతలో ఉమ్మడి జిల్లాల సచివాలయ పరిపాలన అధికారుల బదిలీలు
- ఇరుకు భవనంలో ఇబ్బందులు
- మైకులో మాట్లాడుతున్నంతసేపు ప్రతిధ్వని
- ఖాళీలు చూపించడంలో స్పష్టత కరువు
- అనంత కార్పొరేషన్ పరిధిలో కాసేపు బ్రేక్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కేంద్రంగా ఉమ్మడి అనంత జిల్లాల సచివాలయ పరిపాలన అధికారుల బదిలీల ప్రక్రియ గందరగోళం నడము సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 12 మున్సిపాల్టీలకు సంబంధించి సచివాలయ పరిపాలన అధికారుల (అడ్మిన్స్) బదిలీల ప్రక్రియను శుక్రవారం నాడు అనంతపురం జీసస్ నగర్ జయమణెమ్మ కళ్యాణమండపంలో నిర్వహించారు. 3 గంటలకు ప్రారంభం అవాల్సిన బదిలీల ప్రక్రియ గంట ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. కళ్యాణ మండపం చిన్నదిగా ఉండడంతో బదిలీల నిర్వహణ కోసం వచ్చిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు కనీసం కూర్చొనేందుకు కూడా స్థలం లేక ఇబ్బంది పడ్డారు. కనీసం కమిషనర్లు కూర్చొనేందుకు కూడా వేదిక లేకపోవడంతో కొందరు కిందనే కూర్చొన్నారు. మైకు ద్వారా మాట్లాడుతున్నంత సేపు కళ్యాణ మండలంలో మాటలు ప్రతిధ్వనించడంతో ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాక గందరగోళం నెలకొంది. అనంతపురం కార్పొరేషన్ కౌన్సిల్ హాలు పెద్దగా ఉన్నా అందులో బదిలీల ప్రక్రియ నిర్వహించకుండా వసతులు లేని కళ్యాణ మండపం అద్దెకు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లకు అద్దె ద్వారా లబ్ది చేకూర్చటానికే కళ్యాణమండపం వేదికగా ఎంపిక చేశారనే వాదనలు విన్పిస్తున్నాయి.

జయమణెమ్మ కళ్యాణమండపంలో జరుగుతున్న బదిలీల కార్యక్రమం

ఖాళీలపై స్పష్టత కరువు

బదిలీల ప్రక్రియ 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 4-30 గంటలు దాటినా మొదలవ్వలేదు. ఆయా సచివాలయాల పరిధిలోని ఖాళీలను స్పష్టంగా చూపకపోవడంతోనే బదిలీల ప్రక్రియ ఆలస్యం అయ్యింది. ఖాళీ స్థానాలను అక్కడ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాల్సి ఉంది. మున్సిపాలిటీల వారిగా ఖాళీల వివరాలను బోర్డు మీద ప్రదర్శించిన తర్వాత ఆప్షనల్ ఫారం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇదిజరగకుండానే గుంతకల్లు కమిషనర్ ఆప్షన్ పత్రాన్ని ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ఇక ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాల్టీల లాగిన్ ఐడి అనంత కార్పొరేషన్ కమిషనర్ బాలస్వామి ద్వారానే వినియోగించే ఏర్పాటు చేశారు. ఒక్కరే ఈ పనులు చేయాల్సి రావడంతో తగినంత సమయం లేక సమస్యలు నెలకొన్నాయి. బదిలీల ప్రక్రియ ఆలస్యం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. రాత్రి ఇంటికెళ్లేందుకు బస్సులు లేక అనంతపురంలోనే ఉండాల్సి వచ్చింది. ముందస్తు ప్రణాళిక లేకుండా నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియపై సచివాలయ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు.

అనంత కార్పొరేషన్ పరిధిలో బదిలీ ప్రక్రియకు కాసేపు బ్రేక్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల బదిలీ ప్రక్రియలో 15 పోస్టులను చేర్చకుండా నిలుపుదల చేయటంపై సచివాలయ యూనియన్ జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేషన్ బదిలీల ప్రక్రియను ఆపేశారు. ఆర్డీ ఆదేశాల అనంతరం నిలుపుదల చేసిన 15 పోస్టులను కలిపి రాత్రి 7-15 గంటల తర్వాత బదిలీ ప్రక్రియను ప్రారంభించారు. నగరంలోని ఒక సచివాలయం నుంచి మరో సచివాలయానికి మారడం వల్ల అక్కడ ఐదేళ్ల సర్వీసు పూర్తి కాలేదన్న సాకు చూపి 15 అడ్మిన్ సెక్రటరీల పోస్టులను బ్లాక్ చేసి ఉంచారు. గతంలో మాదిరిగా డేట్ అఫ్ జాయినింగ్‌ను బట్టి సర్వీసును లెక్కించాలి గానీ సచివాలయాల మారినంత మాత్రాన ఐదు ఏళ్ల సర్వీస్ పూర్తి కాలేదని పేర్కొనటం సరికాదని సచివాలయ యూనియన్ నాయకులు తెలిపారు. వీరి అభ్యర్థనపై ఆర్డీ సానుకూలంగా స్పందించడంతో ఆ 15 ఖాళీలతో కలిపి బదిలీ ప్రక్రియను మళ్లీ మొదటి నుంచి ప్రారంభించారు.

కొత్తచెరువులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జులై 5వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పర్యటన ఏర్పాట్ల పనులను చకచకా చేస్తున్నారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర విద్యా కమిషనర్ విజయరామరాజు, జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు కొత్తచెరువులో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను వారు పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్, సమావేశానికి వచ్చే వారికి మౌలిక సదుపాయాల ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఈవో కిష్టప్ప, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోట ఆదినారాయణ, ఎంఈవో జయచంద్ర, పాఠశాల హెచ్‌ఎంలు గోపాల్, నూర్జహాన్ పాల్గొన్నారు.

బస్సు ఎక్కబోయి కిందపడి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుబోయి జారి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సిఐ శేఖర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని రామశంకరయ్య కాలనీకి చెందిన గంగాధర్(50) ఉపాధి హామీ కార్యాలయంలో జేఈఓగా పని చేస్తున్నాడు. అతడు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కబోతూ జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో యూనియన్ మహాసభలు నిర్వహించారు. వీరిసమక్షంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలుగా అమరాపురం నాగమణి, కార్యదర్శిగా పలారం మహదేవమ్మ, కోశాధికారిగా లక్ష్మీదేవిని ఎన్నుకున్నారు. ఇక సెక్టార్ల వారీగా గుడిబండ- జిఎస్ తండా గ్రామం అంగన్వాడీ కార్యకర్త బీమాబాయి, మందలపల్లి -సుజాతమ్మ, దేవీరమ్మ, మోరుబాగల్- తిప్పమ్మ, నాగరత్నమ్మ, రాళ్లపల్లి-నాగవేణి, నాగరత్నమ్మ, కల్పన, అమరాపురం- అగ్రహారం అంగన్వాడీ కార్యకర్త అనసూయ, బసవనపల్లి -రామక్క, సరస్వతి, హేమావతి-అనసూయ, హెల్పర్ నుంచి అమరాపురం సుధను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-పెనుకొండ

నిస్సహాయ స్థితిలో ఉన్న పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరమని మంత్రి సవిత తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 34 మందికి మంజూరైన రూ. 28,80,959 సిఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం మంత్రి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత

నీట్ ఉత్తమ ర్యాంకర్‌కు ఆర్థికసాయం

నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన పేద విద్యార్థి సంతోష్‌నాయక్‌కు స్థానిక జూనియర్ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకుడిగా పని చేస్తున్న ఉమాశంకర్ ఆర్థికసాయం చేశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత చేతుల మీదుగా విద్యార్థికి ఉమాశంకర్ రూ. 20వేల నగదును అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి పట్టుదలతో చదివి నీట్‌లో మంచి ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. భవిష్యత్తులో కూడా బాగా చదివి తల్లిదండ్రులు, గురువులు, ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

విద్యార్థి సంతోష్ నాయకుకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి

నేడు అన్నక్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ

పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శనివారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత భూమిపూజ చేయనున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల వద్ద అన్న క్యాంటీన్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూమిని కేటాయించారని తెలిపారు. భూమి పూజల కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

చెరువుల్లో మట్టిని తీసుకెళ్లే వెసులుబాటు

- ట్రాక్టర్‌కు మూడు రూపాయలు చెల్లిస్తే చాలు
- రూ.59 కోట్లతో పెనుకొండలోని 26 చెరువుల అభివృద్ధి
- బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులు వారి పొలాలను సారవంతం చేసుకునే క్రమంలో భాగంగా అందుకు అసరమైన చెరువు మట్టిని తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, ఇందుకోసం ట్రాక్టర్‌కు మూడు రూపాయలు చెల్లిస్తే చాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలియజేశారు. శుక్రవారం పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గానికి చెందిన అన్ని మండలాల సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజక వర్గంలో సాగునీటి కాలువల్లో జంగిల్ క్లియిరెన్స్, మట్టి తవ్వకాలకు రూ.3.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రూ.50 కోట్లతో నియోజక వర్గంలో ఉన్న 26 చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. చెరువులతో పాటు రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీరందించే కాలువలను సైతం అభివద్ధి చేస్తామన్నారు. పంట పొలాలకు ఎరువుగా చెరువుల్లోని మట్టిని తీసుకెళ్తే అధికారులెవరూ అడ్డుకోరన్నారు. పింఛన్ల పెంపు, గ్యాస్ సబ్సిడీ, తల్లికివందనం, ఉచిత ఇసుక, ల్యాండ్‌యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల తదితర ఎన్నికల హామీలన్నింటినీ ఏడాది కాలంలోనే అమలు చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అన్నదాత సుఖీభవ సాయాన్ని కొద్ది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా టిడిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

సభలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

'తాతల కాలం నుంచి సాగులో ఉన్నాం.. న్యాయం చేయండి'

ప్రజాశక్తి-పెనుకొండ

తాతల కాలం నుంచి సాగులో ఉన్నాం.. ఆ భూమి వ్యవసాయ పనులు చేస్తుంటే కొందరు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు.. తమకు న్యాయం చేయాలని శుక్రవారం మండలంలోని మావటూరు గ్రామంలో రైతులు మొరపెట్టుకున్నారు. రైతులు నల్లప్ప, ప్రకాశప్ప, శ్రీనివాసులు, కొల్లప్పగారి నారాయణప్ప, జయన్న మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 322-14లో 13.40 ఎకరాలు, సర్వేనెంబర్ 324లో 7.61ఎకరాల భూమి 1976లో చిన్న వెంకటప్ప పేరుపై రిజిస్టర్ అయిందన్నారు. ఈ భూముల్లో కొంత భాగం పెద్ద అంజనప్ప, చిన్న బోడెన్న, సిద్ధప్ప కొడుకు సన్న హనుమంతప్ప పేర్లపై ఖాతా నెంబర్లతో 1976లో పాసు పుస్తకాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఈ భూములను 50 కుటుంబాలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాయన్నారు. అయితే ఇప్పుడు చిన్న వెంకటప్ప తమ్ముడు కొడుకులు నాగరాజు, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, తదితరులు తమను భూముల్లోకి వెళ్లకుండా దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని వాపోయారు. రెవెన్యూ, పోలీసులు అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా చిన్న వెంకటప్ప పేరు మీద భూమి రికార్డులు ఉన్నాయని బంధువులు సాగు చేసుకుంటున్నారని ఇన్ని రోజులు ఊరుకున్నామని శ్రీనివాసులు, విజయ్‌కుమార్, మనోజ్, పద్మావతి, మమత, తదితరులు తెలిపారు. ఈ విషయంపై ఇరు వర్గాలు వాదోపవాదనలకు దిగడంతో సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు వారికి సూచించారు.

సాగు చేస్తున్న పొలంలో మాట్లాడుతున్న బాధిత రైతులు

ఎంపీ బికె.పార్థసారథిని కలిసిన యాదవ సంఘం నాయకులు

ఎంపీని కలిసిన యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం సోమందేపల్లి మండల యాదవ సంఘం నాయకులు ఎంపీ బికె.పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించేందుకు సహకారం అందించాలని, శ్రీకృష్ణుడి ఆలయం నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని, శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని వారు కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఆ సంఘం అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు అమరప్ప, ప్రధాన కార్యదర్శి గోపాల్, యాదవ యూత్ అధ్యక్షుడు మైలార్, రాజగోపాల్, శివశంకర్, శ్రీనివాస్, యూత్ కమిటీ కోశాధికారి రాము, ప్రచార కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నాగరాజు, మంజునాథ్, భాస్కర్, బద్రి, ఓబులేష్ ఉన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు సన్మానం

గుడిబండ : ఇటీవల నూతనంగా ఎంపికైన టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్పను శుక్రవారం మండలం లోని మద్దనకుంట గ్రామానికి చెందిన ఆ పార్టీ యువ నాయకులు షబ్బీర్ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, ప్రకాష్, నిరంజన్, మూడ్లగిరియప్ప, నారాయణప్ప, వేణుగోపాల్ రెడ్డి, తిమ్మరాజు, రమేష్, నరసింహస్వామి, బసవరాజు, సిద్దగంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సెలవు కోసం పంచాయతీ కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-లేపాక్షి

పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని 12మంది పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు కోసం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సామూహిక సెలవులో వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రమేష్‌బాబు, దుర్గయ్య, మల్లికార్జున, మారుతి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు

అందని గౌరవ(ం) వేతనం..!

అధికారులు కనీస సమాచారం ఇవ్వడంలేదు.. సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక ప్రజాప్రతినిధులు గౌరవ వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎంపిపిలు, ఎంపిటిసిలకు 18 నెలలుగా గౌరవ వేతనాలు అందలేదు. దీనికి తోడు వారు గ్రామాల్లో ఏ చిన్న అభివృద్ధి పని కూడా చేయించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు సమాజంలో ప్రజలకు సమాధానం చెప్పలేని దుస్థితిలో ఉన్నారు. ఎన్నికల సమయంలో స్థానికంగా ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తామని చెప్పిన వారు ప్రస్తుతం గ్రామంలో ఏ పనులు చేయించలేని పరిస్థితిని ఎదుర్కొంటుండడంతో గౌరవం లేకుండా పోయిందనే పలువురు ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని గౌరవ వేతనాలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మంది ఎంపిపి(మండల అధ్యక్షులు)లు, 841 మంది ఎంపి టిసిలు ఉన్నారు. ప్రతి నెలా ఎంపిపికి రూ. 6వేలు, ఎంపిటిసికి రూ. 3వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. 2024 జనవరి నుంచి నేటి వరకూ వీరికి గౌరవ వేతనాలు అందలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం 6 నెలల వేతనాలు చెల్లించలేకపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా గౌరవ వేతనాల నిధులు విడుదల చేయలేదు.

ప్రాధాన్యత అంతంత మాత్రమే..

కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాధాన్యత, గౌరవం లభిస్తాయని, బకాయి గౌరవ వేతనాలు విడుదలవుతాయని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అయితే గౌరవ వేతనం విషయమై నేటికీ ప్రభుత్వం దృష్టి సారించలేదని పలువురు ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యాక్రమాల్లో అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం మినహా ప్రజల సమస్యలను పరిష్కరించలేక పోతున్నామని పలువురు ఎంపిటిసిలు వాపోతున్నారు. ప్రజల సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు తమను ఆహ్వానించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. నిధులు మంజూరుపై తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, వివక్ష చూపుతున్నారని వారు మండిపడుతున్నారు.

గౌరవ వేతనాలు విడుదల చేయాలి

ఏడాదిన్నరగా గౌరవ వేతనాల కోసం ఎదురుచూస్తున్నాం. బిల్లులు పెట్టామని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణం నిధులు విడుదల చేయాలి.

-రామాంజనేయులు, వైస్ ఎంపిపి

బిల్లులు పెట్టాం - నరేష్‌కృష్ణ, ఎంపిడిఒ

స్థానిక ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాల కోసం బిల్లులు పెట్టాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. 2024 జనవరి నుంచి 2025 మార్చి వరకూ గౌరవ వేతనాల బిల్లులు ప్రభుత్వానికి పంపాం. నిధులు విడుదలైన తక్షణమే గౌరవ వేతనాలు అందిస్తాం.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. మండల కేంద్రంలోని 2,3,4 అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్ వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం పట్నం పిహెచ్‌సి పరిధిలోని వరిగిరెడ్డి పల్లిలో ఇంటెన్సీఫైడ్ టీబీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో టీబి సూపర్వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వంక్షయ వ్యాధిని నిర్మూలన కోసం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ శేఖర్, పద్మజ, ఎఎన్ఎం హస్మత్, ఆశలు అలివేలమ్మ, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు

మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ధర్మవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ముల్లగూరు అయ్యప్పకు ఎంపీడీవో కార్యాలయం అధికారులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసింహనాయుడు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అయ్యప్ప తన పదవీకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి జి.శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి పి.క్రిష్ణప్ప, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని గౌనీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు డాక్టర్ కమల్ రోహిత్ వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. యుక్త వయసు,కౌమార దశలో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో ఎంపిహెచ్ఒ గోపాల్, ఆరోగ్య కార్యకర్త అశ్విని, ఆశ కార్యకర్తలు, 104సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం ఎడిఎగా లక్ష్మి నాయక్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా లక్ష్మినాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణయ్య బదిలీ అయ్యారు. రాయదుర్గంలో పనిచేస్తున్న లక్ష్మినాయక్ ఇక్కడికి బదిలీ కాగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎడిఎ కార్యాలయ సిబ్బంది, సబ్ డివిజన్ సంబంధించిన వ్యవసాయ అధికారులు, ఏఈవోలు పలువురు ఎడిఎకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, డివిజన్ వ్యవసాయ అధికారులు, పర్టిలైజర్ దుకాణ దారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.P. No:22/2023
Between:
బూదిలి రమాదేవి D/o మునిస్వామి డోర్ నెం:2-29, గోవిందువారిపల్లి H/o బాలసముద్రం తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్
మరియు
To,
G.S.బీరేగౌడ S/o M. సిద్దప్ప డోర్ నెం.30, 4వ క్రాస్, సాహి గార్మెంట్స్ దగ్గర అరలుకుంటె, బెంగళూర్ సౌత్, బెంగళూరు now residing at నల్లరాల్లపల్లి క్రాస్ మిండిగల్లు (పోస్టు) H/o చింతామణి, చిక్‌బళ్ళాపూర్ (జిల్లా) ...రెస్పాండెంట్స్
రెస్పాండెంట్‌కు నోటీసు
పై O.P.లోని పిటీషనర్ తన భర్త మీద వారి ఇరువురి వివాహము రద్దు మరియు విడాకుల కొరకు అర్జీ వేసివున్నది. పై అర్జీలో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తమై పై కోర్టు వారు 25/07/2025 వ తేదికీ వాయిదా వేసినారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10:30 గంIIలకు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షములో పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:25/07/2025
స్థలం : కదిరి
ఎ.పి.సిద్దార్థ సాయికుమార్ రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి,
పిటీషనర్ తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి
E.P. No: 32/2023 in O.S. No:111/2019
Between:
సూర్యవంశి శ్రావణ్ కుమార్ S/o ధన్‌రాజ్, డోర్ నెం:6-91-3, పుట్టపర్తి వీధి, కదిరి టౌన్ కదిరి, మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీహోల్డర్
మరియు
షేక్ చాంద్‌బాషా S/o బాబ ఫక్రుద్దీన్ డోర్ నెం.9-488-22-బి3, గాంధీనగర్, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...జెడ్జిమెంట్ డెట్టార్
వేలం ప్రకటన
పై E.P.లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ బాపతు మొత్తము వసూలుపై క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము కోరినాడు. పై కోర్టు వారు ఆస్తుల వేలము కొరకు 28-07-2025వ తేదికి వాయిదా వేయబడినది.వేలములో పాల్గొను వారు 28-07-2025వ తేదిన ఉదయం 10:30 గంIIలకు హాజరై వేలములో పాల్గొన వచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
షెడ్యూలు
Property situated within Ananthapur District Now Sri Sathyasai District, Hindupur Registration District, Now Puttaparty Registration District, Kadiri Sub Registration District within Kadiri Town and Municipal Area. R.C.C House bearing Door No.9-488-22-B3 in Gandhi Nagar, Kadiri Town within the Following **Boundaries**:
East: Open Site of Velidandla Siddaiah,
West: House of Nagamma,
North: Road,
South: Open Site of Velidandla Siddaiah,
D.Hr Value Rs:10,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:28/07/2025
స్థలం : కదిరి
ఎ.పి.సిద్దార్థ సాయికుమార్ రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి,
కె.నరేంద్ర, బి.బి.ఎ., ఎల్.ఎల్.బి,
డిక్రీహోల్డర్ తరుపు వకీళ్ళు, కదిరి

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

దిశా సమీక్ష సమావేశంలో కమిటీ ఛైర్మన్, ఎంపీ బికె. పార్థసారథి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందించే పథకాలను ప్రజల దరికి చేర్చడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) ఛైర్మన్, హిందూపురం ఎంపీ బి.కె పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో దిశా కార్యదర్శి కలెక్టర్ టిఎస్ చేతన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యేలు పల్లె సింధూర,కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయ, మత్స్యశాఖ, గృహ నిర్మాణం, పింఛన్లు, జాతీయ రహదారులపై చర్చించారు. ఈసందర్భంగా ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం కార్యక్రమం ద్వారా దాదాపు 67 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. సాంకేతిక కారణాలవల్ల కొంతమంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందక పోయినప్పటికీ లోపాలు సరి చేసుకుని అర్హులందరికీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్రం రూ. 6 వేలు రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు అందించడం జరుగుతుందన్నారు. కేవలం 456 రూపాయలు వార్షిక ప్రీమియం చెల్లిస్తే రూ. 2 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన పనులను గతంలో ఎందుకు రద్దు చేశారు. ఆ మొత్తం విలువ ఎంత అనే అంశాలపై పది రోజుల్లో నివేదికలు ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. రూ. 3 వేల కోట్లతో జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులపై సమీక్షించారు. పట్నంలో మత్స్యశాఖ కు చెందిన చెరువులో గత ఏడు సంవత్సరాలుగా సొసైటీ సమస్య ఉందని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ పై ఛైర్మన్ అడిగిన ప్రశ్నకు జిల్లాకు 64 వేల క్వింటాళ్లు ప్రభుత్వం మంజూరు చేయగా 50 వేల క్వింటాళ్లు పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లను అర్హులకు అందించాలని ఛైర్మన్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశా కమిటీ సమావేశం జరుగుతుందని, దీని ద్వారా పథకాల అమలు, లోపాలు చర్చించి తగు చర్యలు చేపట్టడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు చేసిన సలహాలు సూచనలు ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, విద్యుత్ శాఖ అధికారి సంపత్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

బుక్‌లెట్లను విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును ఎండగడుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 9న చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ కోరారు. ఈ మేరకు పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో కార్మికులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సమస్యలపై కార్మిక నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా కార్మిక చట్టాల పైన అవగాహన కల్పించేందుకు బుక్‌లెట్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4లేబర్ కోడ్స్ రద్దు చేయాలని. కార్మిక చట్టాలు అమలు చేయాలని. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, అక్కులప్ప, నరసింహులు, బాషా, రామాంజనేయులు, లక్ష్మినారాయణ, అంజి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డిపిఒకు సమ్మె నోటీసు అందజేత

జులై 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా పంచాయతీ కార్మికులు పాల్గొన నున్నట్లు కార్మికసంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు సమ్మె నోటీసును డిపిఒ సమతకు శుక్రవారం అందజేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం లో కార్మిక సంఘం నాయకులు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఆక్కులప్ప, నరసింహులు, లక్ష్మీనారాయణ ,రమేష్ ,రామాంజనమ్మ, మునీంద్ర ,మహబూబ్ లు కలిసి డిపిఒకు సమ్మె నోటీసు అందజేశారు.

సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కూటమి ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రంలో భాగంగా శుక్రవారం కదిరి పట్టణంలోని 20వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ,ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కదిరి ఎమ్మెల్యేగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి గ్రామాల వారిగా చేస్తున్న కార్యక్రమాలపై వివరిస్తూ, ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

స్థానికురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీచైతన్య పాఠశాల గదులు సీజ్

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల ఎల్.కే.జి, యూకేజీ తరగతుల గదులను ఎంఇఒ సీజ్ చేశారు. అనుమతులు లేకుండా యూకేజీ, ఎల్ కేజీ తరగతులు నిర్వహిస్తూ ఒక్కొక్క విద్యార్థి దగ్గర రూ.22 వేల నుండి రూ.25 వేల వరకు ఫీజులు వసూలు చేస్తూ తల్లి తండ్రులను మోసం చేస్తున్నారన్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు బాబావలి, వైయస్ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కదిరిష్ తదితరులు ఎంఇఒకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పాఠశాల వద్దకు చేరుకొని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న యూకేజీ, ఎల్ కేజీ గదులను సీజ్ చేశారు. ఈ పాఠశాలకు అనుమతులు లేవని, తరగతులు నిర్వహించకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్, భరత్, సాయిరాం, అనుదీప్, ఫణి, నాజీర్, శివ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలి : ఆర్డీవో

ప్రజాశక్తి - బత్తలపల్లి

రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ప్రతి అధికారి ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి పెండింగ్ సమస్యలు లేకుండా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్నితనిఖీ చేశారు. కార్యాలయపు పనితీరును సమీక్షించి, కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన బాధ్యతగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. పారదర్శకతతో ప్రజలకు సేవలందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని స్పష్టం చేశారు. రెవిన్యూ రిజిస్టర్లు పెండింగ్ సర్వీసెస్, పెండింగ్ అర్జీలను ను పరిశీలించి వాటిని వెంటేనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్, విఆర్ఒలు, గ్రామసర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి,- ధర్మవరం రూరల్

రిలేదీక్షల్లో నాయకులు, కార్మికులు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో శుక్రవారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనం రూ.24500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్ కార్మికులకు 25వేల రూపాయల వేతనం పెంచి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారం లోకి వచ్చిన వెంటనే మాట మార్చడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యోగేష్, కాటమయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే, తది తరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్, అర్బన్

మహిళా సాధికారికత్కఉ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో 26 మంది మెప్మా ఆర్ పి లకు ఎమ్మెల్యే పల్లె సింధూర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలను ప్రథమంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మహిళా ఆర్థిక సాధికారికతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని భావించి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ రోజుల్లో చాలామంది మహిళలు సంఘాల ద్వారా అభివృద్ధి చెందుతున్నారన్నారు. మహిళా సంఘాలు తమసంఘాల బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న, నాయకులు సామకోటి ఆదినారాయణ, ప్రశాంతి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి రామ తులసమ్మ, టి ఎం సి రమాదేవి, మెప్మా సిబ్బంది ఆర్ పి లు పాల్గొన్నారు.

చెరువు కట్టలను పటిష్టం చేయండి : నియోజకవర్గంలోని అన్ని చెరువుల కరకట్టలను పటిష్టం చేయాలని శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్ వెనుక వైపున ఉన్న నూతన ఇరిగేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను, హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నింపుతామని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత ఇరిగేషన్ అధికారులు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ గంగాధర్, ఎఇ జమున బాయి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ వద్ద ఉన్న 9వ గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర తెనిఖీ చేశారు. సచివాలయంలో హాజరు పట్టిని పరిశీలించారు. సిబ్బంది కొందరు గైరు హాజరు అయినట్లు గుర్తించి ఎమ్మెల్యే ఆ పుస్తకంలో సంతకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కూటమి నాయకులు రామాంజనేయులు, సామకోటి ఆది, ఉమాపతి, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి : ఆర్డీవో

ప్రజాశక్తి - కదిరి అర్బన్

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వికలాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో వివిఎస్ శర్మ సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక భవితకేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. భవిత కేంద్రంలోని వికలాంగుల ఆరోగ్య పరిస్థితిని వారికి, అందిస్తున్న సౌకర్యాలను అక్కడున్న ప్రభుత్వ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్.రూపేష్ నాయక్‌తో మాట్లాడారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించే విద్యా కార్యక్రమాలు గురించి ఆరా తీశారు. ప్రత్యేక పిల్లలందరికీ పింఛను వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్ర ఉపాధ్యాయులు అన్వేష్ , సౌజన్య పిల్లలకు అందిస్తున్న అవసరాలను ఆర్డీవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు చెన్నకృష్ణ , ఓబుల్ రెడ్డి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు అన్వేష్, సౌజన్య, రూపేష్ నాయక్, శ్రీదేవి, విద్యార్థులు తల్లితండ్రులు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ బాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి - హిందూపురం

కర్నూలు నగరంలోని ఆదర్శ విద్యా మందిరం క్రీడామైదానంలో ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు బాలికల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పాల్గొని విద్యార్థినుల ప్రతిభను తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తద్వారా మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే చదువులో కూడా ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఎంపిక చేసిన జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి యాసిన్ మాలిక్, ప్రిన్సిపల్ నాగమణి, వైస్ ప్రిన్సిపల్ ఇందిరా, పిడి రూపావతి, పిఇటి ఈస్టర్ రాణి, టీడీపి నాయకులు ప్రెస్ వెంకటేష్, ఆదిల్, దుర్గా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఖర్చులకు డబ్బు ఇవ్వలేదని

తండ్రిపై కొడుకు కొడవలితో దాడి

- పరిస్థితి విషమం - బెంగళూరు ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- పరిగి

ఖర్చులకు డబ్బు ఇవ్వలేదన్న కారణంతో వ్యక్తి తన తండ్రిపై కొడవలితో దాడి చేసిన సంఘటన పరిగి మండలంలోని ఎర్రగుంట గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు... ఎర్రగుంట గ్రామానికి చెందిన క్రిష్టప్ప వ్యవసాయం చేస్తూ పశువులను కొనుగోలు చేసే వ్యాపారం చేస్తుండేవాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె. అయితే అయితే పెద్ద కుమారుడు హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు శంకరప్ప మానసికంగా సరిగ్గా లేకపోవడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించాడు. ఈ నేపథ్యంలో శంకరప్ప వ్యవసాయ పనులు చేసుకుంటూ పశువులను మేపుకుంటూ ఉండేవాడు. మానసికంగా సరిగ్గా లేకపోవడంతో పలుమార్లు శంకరప్ప తన తండ్రిపై దాడికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఈనేపథ్యంలో తనకు ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో శంకరప్ప గురువారం తన తండ్రితో గొడవ పడితే అతని తల్లి సర్దిచెప్పింది. అయితే శుక్రవారం తెల్లవారుజామున శంకరప్ప కొడవలితో తండ్రి కిష్టప్ప మెడ పై నరికాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కిష్టప్పను హిందూపురం కు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగని వైద్యం కోసం బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శంకరప్పను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

తుపాకులు, కత్తులతో బెదిరించి నగలు దోపిడీ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురంలో భార్యాభర్తలకు కత్తులు, తుపాకీలు చూపించి బంధించి నగలు దోచుకెళ్లిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. హిందూపురం మండలం కిరికెర పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాద్రి లే అవుట్ లో నివాసమున్న నిత్యానంద రెడ్డి ఇంటిలో గురువారం రాత్రి భారీ దోపిడీ జరిగింది. బాధితులు నిత్యానంద రెడ్డి, అతని భార్య కోమల తెలిపిన మేరకు వివరాలు.. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటిలో భోజనం చేస్తుండగా కారులో ఐదుగురు దుండగులు వచ్చారు. అందులో ఒకరు కారులోనే ఉండగా మరో నలుగురు ఇంట్లోకి వచ్చారు. ఇంట్లోకి వచ్చిన వెంటనే కోమలి మెడపై కత్తి పెట్టి తుపాకి చూపించి మెడలో ఉన్న బంగారాన్ని లాక్కున్నారు. అనంతరం నిత్యానంద రెడ్డి చేతులు కట్టేసి పూజ గదిలో బంధించి తాళం వేశారు. అతని భార్య కోమలను మరో గదిలో బంధించారు. అక్కడే వారి తల్లిదండ్రులు నరసారెడ్డి, లక్ష్మీ దేవమ్మ , చిన్న పిల్లలు ఉండగా వారిని గదిలో కూర్చోమని చెప్పారు. బీరువాలో ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అయితే వెళ్తూ ఈ విషయం పోలీసులకు చెబితే మీ కుమారుడిని చంపేస్తామని హెచ్చరించారు. వారు వెళ్లిపోయిన కొద్దిసేపటికి పూజ గదికి వేసిన తాళం పగలగొట్టడంతో నిత్యానందరెడ్డి బయటికి వచ్చాడు. జరిగిన ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే డీఎస్పీ మహేష్, అప్ గ్రేడ్ సీఐ ఆంజనేయులు, సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సమీపంలో ఉన్న సిసి పుటేజీనిపరిశీలించారు. అయితే వచ్చిన వారందరూ హిందీలో మాట్లాడారని, అంతేగాక వారిలో ఒకరిద్దరు తాము వచ్చింది ఎవరినో చంపడానికి అని ఎమ్మెల్యే కుమారుడు తమకు తప్పుడు సమాచారం ఇచ్చాడని వారిలో వారు తిట్టుకున్నట్లు బాధితుడు నిత్యానంద రెడ్డి పోలీసులకు తెలిపాడు. సుమారు 25 తులాల బంగారం నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం చేసుకొని తిరిగి వెళ్లే సమయంలో దుండగులు ఇద్దరు మహిళలకు సంబంధించిన తాళిబొట్లు వెనక్కి ఇచ్చి వెళ్లారు. ఈచోరీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు దర్యాప్తు సాగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఇక్కడకి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఎప్పుడూ లేని విధంగా ఈ తరహా దోపిడీ జరగడం పట్ల స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పరిగిలో పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోనాపురం గ్రామంలో 8 ఏళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించారన్న కారణంతో వెంకటరమణ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణప్ప ఇంటి సమీపంలో ఉన్న 8 ఏళ్ల చిన్నారి ఆడుకుంటుండగా ఇంట్లోకి పిలుచుకుని వెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎస్ఐ రంగడు యాదవ్ వెంకటరమణను ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కుమారుడు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి తనకల్లు

మండల పరిధిలోని గీతాలవారిపల్లి, గ్రామానికి చెందిన 26 సంవత్సరాల తమ కుమారుడు కన్పించలేదని యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు ప్రవీణ్‌కుమార్ గురువారం (26)న ఇంటినుంచి వెళ్లిపోయాడు. ప్రవీణ్ కుమార్, కొక్కంటి గ్రామానికి చెందిన ముక్కేసాబ్, అనే వ్యక్తి వద్ద రూ. 20వేల రూపాయలు అధిక వడ్డీకి అప్పుగా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో డబ్బు ఇవ్వలేదన్న కారణంతో ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని ముక్కేసాబ్ బలవంతంగా తీసుకెళ్లాడు. దీంతో మనస్థాపానికి గురైన ప్రవీణ్‌కుమార్ ప్రవీణ్ కుమార్ ఇంటికి రాకుండా ఎక్కడికో వెళ్లిపోయినాడు. ఈ నేపథ్యంలో ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకటరమణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

సిడిపిఒగా రాధిక

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు ఐసిడిఎస్ సిడిపిఒగా రాధిక శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కదిరి సిడిపిఒగా పనిచేస్తున్న రాధిక బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమిష్టికృషితో ప్రాజెక్టుకు మంచిపేరు తీసుకువస్తామన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - హిందూపురం

తుముకుంట పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్యదర్శి కెంచరాయప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రజలు ఇళ్లలో ఉత్పత్తి అయిన చెత్తను తడి, పొడి చెత్త వేరువేరుగా నిలువ చేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్రజల నుండి సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పంచాయతీ సుందరీకరణకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న మున్వర్‌బాషా కుటుంబానికి ముస్లిం నాయకులు ఆర్థిక సహాయం అందించారు. కార్పెంటర్ పనితో జీవనం సాగిస్తున్న మున్వర్ బాషా తల్లికి పక్షవాతం రావటంతో కాళ్లు చేతులు పడిపోయాయి. మున్వర్ బాషాకు కూడా కంటి ఆపరేషన్ జరిగింది.దీంతో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మున్వర్‌బాషా కుటుంబానికి తమవంతు సాయంగా 15 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో శక్తి యాప్‌బృందాలు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలో అవగాహన కల్పించాయి. డీఎస్పీ ఆదినారాయణ ,పర్యవేక్షణలో శక్తి బృందాలు కళాశాలలు, పాఠశాలల్లో బాలికల మహిళలకు ,శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.